క్లుప్తంగా

పుణ్య క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

చుంచుపల్లి: వేములవాడ శ్రీ రాజరాజేశ్వరి స్వామి, కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయాల సందర్శన కోసం కొత్తగూడెం డిపో నుంచి ఒకరోజు టూర్ ప్యాకేజీగా డీలక్స్ బస్సు నడిపించనున్నట్లు డిపో మేనేజర్ ఎం.దేవేందర్‌గౌడ్ తెలిపారు. ఈ నెల 27న శుక్రవారం రాత్రి 8 గంటలకు కొత్తగూడెం బస్టాండ్ నుంచి బస్సు బయలుదేరుతుందని, తిరుగు ప్రయాణంలో వరంగల్ వేయి స్తంభాల గుడి, భద్రకాళి అమ్మవారి దర్శనం ఉంటుందని పేర్కొన్నారు. అదేరోజు ఉదయం 5 గంటలకు మరో డీలక్స్ బస్సు ఇల్లెందు నుంచి బయలుదేరి వరంగల్ భద్రకాళి, వేయి స్తంభాల గుడి, రామప్పగుడి, లక్నవరం, తిరుగు ప్రయాణంలో మల్లూరు శ్రీ నరసింహ స్వామి, పాల్వంచ పెద్దమ్మ ఆలయాల మీదుగా నడుస్తుందని తెలిపారు. ఈ బస్సులో కొత్తగూడెం నుంచి పెద్దలకు రూ.1,310, పిల్లలకు రూ.660, ఇల్లెందు నుంచి పెద్దలకు రూ.1,280, పిల్లలకు రూ.650గా చార్జీ నిర్ణయించినట్లు డీఎం వివరించారు. వివరాలకు 99592 25959, 73828 58008, 73828 58258, 93467 28893 (ఇల్లెందు) నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఇల్లెందు ఏరియాలో డైరెక్టర్ పర్యటన



అధికారులతో సమీక్షిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్లు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో డైరెక్టర్ (ప్రాజెక్టు అండ్ ప్లానింగ్) కె.వెంకటేశ్వర్లు, జీఎం (క్వాలిటీ) కనకయ్య పర్యటించారు. మంగళవారం జేకే–5 ఓసీ, నూతన జేకే కోల్ మైన్స్ ప్రాజెక్టుకు సంబంధించిన స్థలాలను పరిశీలించారు. జేకేఓసీలో రోజు వారీ ఉత్పత్తి, రవాణా, ఓబీ బ్లాస్టింగ్, లోడింగ్ పనులను ఓస్ఓటూ జీఎం రామస్వామిని అడిగి తెలుసుకున్నారు. బొగ్గు ఉత్పత్తి రవాణా రోజు వారీ లక్ష్యాలను అధిగమించాలని, బొగ్గు ఉత్పత్తి రవాణాకు ఆటంకం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. నూతన ఓసీ పని స్థలాలను పరిశీలించిన ఆయన అధికారులతో సమీక్షించారు. నూతన ఓసీ పనులు వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ కృష్ణమోహన్‌రావు, కేఓసీ పీఓ గోవిందరావు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

పాల్వంచరూరల్: గిరిజన రైతులు 70 మందికి 1986లో ప్రభుత్వం పాస్ పుస్తకాలు ఇచ్చారని, కానీ, ఇప్పటికీ భూములు కేటాయించలేదని పాండురంగాపురంతండా రైతులు తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. పాండురంగాపురం రైతువేదికలో మంగళవారం సదస్సు నిర్వహించగా.. గత ప్రభుత్వం కొంత మంది రైతులకు పాస్ పుస్తకాలు ఇచ్చి కొందరికి ఇవ్వకుండా నిలిపివేశారని, పాండురంగాపురం రెవెన్యూ పరిధిలో 800 ఎకరాల సీలింగ్ భూమి ఉందని, 126లో 1,826 ఎకరాల భూమి ఉందని, సర్వే నిర్వహించి గిరిజన రైతులకు ఇవ్వాలని పలువురు కోరారు. కార్యక్రమంలో గుగులోతు భద్రు, భరత్, బిచ్యానాయక్, రాములునాయక్, కిషన్, బేబి, గోపాల్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే కార్మికులకు తీపి కబురు



మాట్లాడుతున్న రాజ్‌కుమార్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మారు పేర్ల విషయంలో త్వరలో తీపి కబురు తెలుపనున్నట్లు సింగరేణి గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం కొత్తగూడెంలోని జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుర్తింపు ఎన్నికల సందర్భంగా కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు అలియాస్ పేర్ల మార్పిడిపై ఈనెలలో యాజమాన్యంతో జరిగే సమావేశంలో చర్చించి, పరిష్కరిస్తామని చెప్పారు. సమావేశంలో వంగ వెంకట్, ఎస్.వి.రమణమూర్తి, ఎస్.రాము, వి.మల్లికార్జున్‌రావు, గట్టయ్య, హుమాయున్, నాగేశ్వరరావు, సందెబోయిన శ్రీనివాస్, రామ్‌శంకర్, బండారు మల్లయ్య పాల్గొన్నారు.

మరుగున పడేశారు..

ప్రజా మరుగుదొడ్లు లేక అవస్థ పడుతున్న ప్రజలు

- మహిళల ఆత్మగౌరవానికి భంగం
- వేలాది మంది రాకపోకలు సాగిస్తున్నా.. సులభ్ కాంప్లెక్స్‌పై దృష్టి సారించని అధికారులు, ప్రజా ప్రతినిధులు



సుజాతనగర్ మండల కేంద్రంలోని ప్రధాన కూడలి

సుజాతనగర్: మండల కేంద్రంలో ప్రజావసరాలు, అందులోనూ అత్యవసరాలను తీర్చే మౌలిక సదుపాయాలైన ప్రజా మరుగుదొడ్లు అందుబాటులో లేవు. మండల కేంద్రంలో మొత్తం 25 వేల పైనే జనాభా ఉన్నారు. వివిధ అవసరాల కోసం మండల కేంద్రానికి వచ్చే ఇతర గ్రామాల మహిళలు, పురుషులతో పాటు మండల కేంద్రం నుంచి ఇతర ప్రాంతాలకు ప్రయాణం కోసం వచ్చే వారికి బహిరంగ మరుగుదొడ్ల ఏర్పాటుపై అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఏళ్లుగా ప్రజల నుంచి విజ్ఞప్తులు వస్తున్నా వసతుల కల్పనకు ముందడుగు పడటం లేదు. ఎక్కడ ఖాళీ స్థలాలు కనబడితే అక్కడ పురుషులు మల, మూత్ర విసర్జన చేస్తున్నారు. కానీ, వివిధ అవసరాల కోసం మండల కేంద్రానికి వచ్చిన మహిళలకు అత్యవసర పరిస్థితులు ఏర్పడితే అవస్థలు తప్పడం లేదు.

అవసరాలను గుర్తించక..

మండల కేంద్రంలో ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు అందుబాటులోకి వచ్చాయి. రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయం, బ్యాంకులు, పోలీస్‌స్టేషన్‌తో పాటు వివిధ వ్యాపార, వాణిజ్య అవసరాల కోసం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన వందలాది మంది ప్రజలు నిత్యం వస్తుంటారు. వివిధ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులకు తప్పించి బయటి వారికి మరుగుదొడ్ల సౌకర్యం లేదు. అలాగే వివిధ గ్రామాల నుంచి బ్యాంకులకు డ్వాక్రా సంఘాల సభ్యులు, ఇతర పనులపై వచ్చిన వారు, వాహనాల కోసం గంటల తరబడి ప్రయాణ ప్రాంగణాల్లో నిరీక్షిస్తుంటారు. ఆ సమయంలో అత్యవసరాలు తీర్చుకునేందుకు వసతులు అక్కడ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

మహిళల పరిస్థితి మరీ దారుణం

అటు ఉద్యోగాల్లో.. ఇటు వ్యాపారాల్లో మగవారితో సమానంగా అన్ని రంగాల్లో దీటుగా అడుగులు వేస్తున్న మహిళలు పలు సందర్భాల్లో ఇబ్బందులు పడుతున్నారు. మహిళలకు మగవారితో సమానంగా అన్నింట్లో సమాన అవకాశాలు అంటారు. కానీ, కనీస అవసరాలు పట్టించుకోరు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, వ్యాపార కేంద్రాలకు పలు అవసరాల నిమిత్తం మండల కేంద్రాలకు వచ్చే మహిళలకు ప్రజా మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడం సమస్యలకు కారణమవుతోంది. వ్యాపారులు దుకాణాలను వదిలి ఇంటికి వెళ్లాల్సి వస్తోందని చెబుతున్నారు. పలువురు ఖాళీ స్థలాల్లో మూత్రవిసర్జన చేస్తుండటంతో పరిసరాలు దుర్గంధంగా మారుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మండల కేంద్రంలో కనీసం ప్రజా మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించాలని కోరుతున్నారు.

సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలి



మండల కేంద్రంలో సులభ్ కాంప్లెక్స్ లేకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. పెరిగిన ప్రజా అవసరాలు, జనాభాకు అనుగుణంగా అధికారులు కనీస సదుపాయాలు కల్పించాలి. మండల కేంద్రానికి వచ్చేవారికి ప్రజా మరుగుదొడ్ల అవసరం ఉంటుంది.

–కాట్రాల తిరుపతిరావు, సీపీఎం నాయకుడు, సుజాతనగర్ మండలం

ప్రజల ఇబ్బందులు గుర్తించాలి



మండల కేంద్రంలో ప్రజా మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారం, జనాభాకు అనుగుణంగా మండల కేంద్రంలో అధికారులు సరైన సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహించడం తగదు. ప్రజల ఇబ్బందులను గుర్తించాలి.

–లోశెట్టి నాగార్జున్, రాఘవాపురం, సుజాతనగర్ మండలం

విత్తన దుకాణాల్లో తనిఖీలు



ఇల్లెందురూరల్: మర్రిగూడెం గోదాములో నిల్వలను పరిశీలిస్తున్న ఏడీఏ లాల్‌చంద్, ఏఓ



టేకులపల్లి: విత్తన దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ నర్సింహారావు, ఏఓ

ఇల్లెందురూరల్: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు లాల్‌చంద్ స్పష్టం చేశారు. మండలంలోని మస్సివాగు, పోలారం, మర్రిగూడెం గ్రామాల్లో మంగళవారం విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల విక్రయ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణ గోదాముల్లో ఉన్న నిల్వలను, రికార్డుల్లో నమోదు చేసిన వివరాలతో సరిచూశారు. బోర్డులపై పొందుపర్చిన వివరాలను పరిశీలించారు. విత్తనాలు, ఎరువులు అధిక ధరలకు విక్రయించినా, నకిలీ విత్తనాలు విక్రయించినా, నిబంధనలు అతిక్రమించినా సంబంధిత దుకాణం లైసెన్స్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులు కోరిన విత్తనాలను మాత్రమే విక్రయించాలని చెప్పారు. ఏఓ సతీశ్, సిబ్బంది పాల్గొన్నారు.

టేకులపల్లిలో..

టేకులపల్లి: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని టాస్క్‌ఫోర్స్ ఏడీఏ నరసింహారావు హెచ్చరించారు. మంగళవారం టేకులపల్లి, కోయగూడెం గ్రామాల్లోని విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్, ఇన్‌వాయిస్, బిల్ బుక్, విత్తన కంపెనీల పర్మిషన్ లెటర్, వివరాలు పరిశీలించారు. కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకి రశీదు ఇవ్వాలని, బిల్‌పై రైతు, డీలర్ సంతకాలు ఉండాలన్నారు. రైతులు పంట కాలం ముగిసేంత వరకు బిల్లులు భద్ర పర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ అన్నపూర్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యమే ప్రమాదాలకు మూలం

సింగరేణి(కొత్తగూడెం): చిన్న నిర్లక్ష్యం పెను ప్రమాదాలకు దారి తీస్తుందని, ప్రతి ఒక్కరూ భద్రతా నియమాలను తప్పనిసరి పాటిలంచాలని కొత్తగూడెం ఏరియా రక్షణాధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం ఏరియాలోని వీకే వర్క్‌షాపులో ప్రమాదాల నివారణకు సంబంధించి అవగాహన కల్పించారు. కార్మికులు పనిస్థలంలో రక్షణ సూత్రాలు పాటించాలని, ప్రమాదాల సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్క్‌షాపు ఇంజనీర్లు ఉపేందర్‌బాబు, శంకర్, అనిల్ మాట్లాడుతూ.. వర్షకాలంలో విద్యుత్ ప్రమాదాలు అధికంగా జరుగుతాయని, తడి చేతులతో ఎలాంటి విద్యుత్ వైర్లు ముట్టుకోవద్దని చెప్పారు. పని స్థలంలో వర్షం నీరు నిలిచి ఉన్నచోట జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమలో వర్క్‌షాప్ పిట్ సెక్రటరీ మధుకృష్ణ, సూపర్ వైజర్లు, ఫోర్‌మెన్‌లు నాగమోహన్, రాంచందర్, యాకూబుద్దీన్, గుమ్మడి వీరన్న, సముద్రాల శ్రీనివాస్, కరుణాకర్, నరేశ్, టీఆర్ఎస్ రాజు, కిరణ్‌కుమార్, అంకుష్, సలిగంటి శ్రీనివాస్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వర్లు

పంట వ్యర్థాలను కాల్చొద్దు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు, రైతులు

సుజాతనగర్: రైతులు తమ పంటలను తీసివేసిన తరువాత వ్యర్థాలను కాల్చొద్దని, వాటిని భూమిలో కలియదున్నాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ వి.లక్ష్మీనారాయణమ్మ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో వ్యవసాయ సంబంధిత సలహాలు, సూచనలతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించిన ఆమె మాట్లాడారు. పంటల వ్యర్థాలను భూమిలో కలియదున్నడం ద్వారా భూసారం పెరగడమే కాకుండా పర్యావరణ కాలుష్యం కూడా తగ్గుతుందన్నారు. రైతులు పొలం గట్ల వెంబడి చెట్లను పెంచాలని, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మండె హనుమంతరావు, ఉద్యానవన శాస్త్రవేత్త శివ, ఏఓ జి.నర్మద, ఏఈఓ శరత్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం



ప్రొసీడింగ్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

టేకులపల్లి: కాంగ్రెస్ ప్రజాపాలనలో పేదల సొంతింటి కలను సాకారం చేశామని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలోని 36 గ్రామాలకు చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేసి, మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పాలనను పట్టించుకోకుండా పైరవీలకు పెద్దపీట వేసిందని, నాడు పేదల సొంతింటి కల.. కలగానే మిగిలిపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మొదటి విడతలో పేర్లు రానివారు నిరాశ చెందొద్దని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రక్రియ విడతల వారీగా ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం మండలానికి చెందిన 44 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీరభద్రం, ఎంపీడీఓ జేఎల్ గణేశ్‌గాంధీ, కోరం సురేందర్, బానోత్ రాంబాబు, భూక్యా దేవా, ఉల్లోజి ఉదయ్, రెడ్యానాయక్, ఈది గణేశ్, పోషాలు, సంజయ్, భద్రు, మంగీలాల్, ధర్మయ్యగౌడ్, మధురెడ్డి, సతీశ్, సర్దార్, రవి, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట షురూ

టేకులపల్లి/సింగరేణి(కొత్తగూడెం): అమ్మమాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమం మంగళవారం టేకులపల్లి మండలంలో ప్రారంభమైంది. ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు సీడీపీఓ కేఎం తార కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ నెల 17 వరకు గ్రామాల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. అనంతరం బొమ్మనపల్లి, సులానగర్ సెక్టార్లలో పాల్గొన్న సీడీపీఓ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో మూడేళ్లు, నాలుగేళ్లు నిండిన పిల్లలను అంగనవాడీ కేంద్రాల్లో చేర్పిస్తామని, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తామని తెలిపారు. సెంటర్లలో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీలకు సంబంధించిన ఇంగ్లిష్ మీడియం వర్క్‌బుక్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో బొమ్మనపల్లి, సులానగర్, గంగారం సెక్టార్ల సూపర్‌వైజర్లు యశోదమ్మ, నిర్మల, లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, వైద్య సిబ్బంది హారిక, పద్మ, కమల, విజయలక్ష్మి, డి.విజయ, లక్ష్మి, సుజాత, లక్ష్మీ, మాలతికుమారి, రాంబాయి, శారద పాల్గొన్నారు. అలాగే, చిట్టిరామవరం 11వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మమాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించగా సీడీపీఓ పద్మశ్రీ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పార్వతి, టీచర్లు రాధిక, మంజు, హెల్పర్లు నిర్మల, భవాని, వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



టేకులపల్లి: కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీడీపీఓ తార తదితరులు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాల్వంచరూరల్: మండలంలోని తోగ్గూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులను మంగళవారం ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఎంపీడీఓ వెంట ఏపీఓ రంగా, గ్రామ కార్యదర్శి రవికుమార్ ఉన్నారు.

కేజీబీవీల వంట సిబ్బందికి శిక్షణ

జూలూరుపాడు: విద్యార్థినులకు అందించే నూతన ఆహార మెనూపై జిల్లాలోని కేజీబీవీల వంట సిబ్బందికి మంగళవారం ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జీసీడీఓ అన్నామణి మాట్లాడుతూ.. డీఆర్పీల సమక్షంలో వంట సిబ్బందికి శిక్షణ అందించామని, నూతన మెనూలో పొందుపరిచిన 15 రకాల వంటలను సిబ్బంది తయారు చేశారని తెలిపారు. విద్యార్థినులకు శుభ్రత, రుచికరం, నాణ్యతతో కూడిన భోజనాన్ని సకాలంలో అందించాలని పేర్కొన్నారు. జిల్లాలో కేజీబీవీ–14, యూఆర్ఎస్–1, టీఆర్ఐఈఎస్–1లోని వంట సిబ్బంది శిక్షణలో పాల్గొన్నారని వెల్లడించారు. ఎస్కే సైదులు, కె.సతీశ్, నాగరాజు, శేఖర్, పద్మజ, తులసి, కవిత పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న సిబ్బంది, అధికారులు

రిటైర్డ్ హెచ్‌ఎంకు అవార్డు

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లు గ్రామానికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం డాక్టర్ మద్దిశెట్టి వెంకటేశ్వరరావుకు ప్రతిభ నోబెల్ అవార్డు లభించింది. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్, శ్రీ ప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. వెంకటేశ్వరరావుకు భారత్ ప్రతిభ నోబెల్ అవార్డును అతిథులు, నిర్వాహకులు అందించారు. మంగళవారం వెంకటేశ్వరరావు వివరాలు తెలిపారు.

రెండు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

జూలూరుపాడు: మండలంలోని గుండ్లరేవు, గుండెపుడి గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ అధికారులు భూభారతి సదస్సులు నిర్వహించారు. గుండ్లరేవులో తహసీల్దార్ శ్రీనివాస్, గుండెపుడిలో ఆర్ఐ ఆదినారాయణ రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. భూ భారతితో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు గ్రామాల్లో నిర్వహించే సదస్సుల్లో రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఓ నరసింహారావు, సీనియర్ అసిస్టెంట్ దేశపాండే, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలని ధర్నా

పాల్వంచరూరల్: నకిలీ విత్తనాలను అరికట్టాలని, రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులను సరఫరా చేయాలని ఎస్సీ, ఎస్టీలకు సబ్సిడీ ద్వారా అందించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు కల్లూరు కిశోర్ మాట్లాడారు. పెండింగ్ బోనస్‌ను వెంటనే చెల్లించాలని, సమగ్ర పంటల బీమాను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్.వెంకటేశ్వర్లు, ఎస్.నాగేశ్వరరావు, రామారావు, వేల్పుల రమేశ్, రమేశ్, ఎర్రన్న పాల్గొన్నారు.

బూడిదతో అవస్థలు

టేకులపల్లి: బూడిద దుమ్ముతో జనం అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రానికి సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న సిమెంట్, ఫ్లైయాష్ (బూడిద) ఇటుకల తయారీ కేంద్రాల వద్ద రోడ్డుకు సమీపంలోనే బూడిదను డంపింగ్ చేస్తున్నారు. దీంతో బూడిద గాలిలోకి లేచి రాకపోకలు సాగించే వారికి ఇబ్బందికి కలిగిస్తోంది. ఇలాగే కొనసాగితే వాహనదారులు అదుపు తప్పి కింద పడే ప్రమాదం ఉంది. నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని, ఉన్నతాధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

డీజీఎంకు సన్మానం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని పర్సనల్ విభాగంలో డీజీఎంగా విధులు నిర్వర్తించిన బి.శివకేశవరావు బదిలీపై వెళ్తుండగా మంగళవారం సన్మానించారు. రాజేశ్వరరావు, గౌస్, రాజయ్య, బీముడు, కుమార స్వామి, సత్తార్, సాగర్ పాల్గొన్నారు.

లబ్ధిదారుల అభీష్టం మేరకే నిర్మించాలి

ఇల్లెందు: ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారుల అభీష్టం మేరకే నిర్మించాలని, కాంట్రాక్టర్‌కు అప్పగించొద్దని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం ఇల్లెందులోని ఏలూరిభవన్‌లో సీపీఎం మండల కమిటీ సమావేశం నాయకుడు తాళ్లూరి కృష్ణ అధ్యక్షతన నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. తమ మాట వినకపోతే బిల్లులు రావని లబ్ధిదారులను భయభ్రాంతులకు గురిచేయొద్దని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే అవకాశం లబ్ధిదారులకు ఉందన్నారు. పేదలను ఆసరాగా చేసుకుని కాంట్రాక్టర్లు ముందుకు వస్తున్నారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని కోరారు. సీతారామ ప్రాజెక్టును పాత డిజైన్ ప్రకారం నిర్మించాలని, జిల్లా రైతాంగానికి ముందు నీరు అందించాలని, తర్వాతనే ఇతర ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ఇల్లెందు నియోజకవర్గంలో అన్ని మండలాలకు సాగు, తాగునీరు అందించాలని పేర్కొన్నారు. జిల్లాలో సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, పోడు భూముల మీద ఫారెస్టు అధికారుల దమనకాండ ఆపాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలు చేపట్టేందుకు సన్నద్ధం కావాలని నాయకులకు పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర, జిల్లా నాయకులు ఏజే రమేశ్, అబ్దుల్ నబీ, మండల కార్యదర్శి ఆలేటి కిరణ్, మోహన్‌రావు, సుల్తానా, మదారపు వెంకటేశ్వర్లు, ఆలేటి సంధ్య, మరియా, కొడెం బోస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మచ్చా వెంకటేశ్వర్లు

సాంస్కృతిక పోటీల్లోనూ రాణించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతోపాటు సాంస్కృతిక పోటీల్లో, క్రీడల్లో రాణించినప్పుడే ఉల్లాసంగా ఉంటారని జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్రా కామేశ్ అన్నారు. కొత్తగూడెం పట్టణంలోని రైల్వే ఫంక్షన్ హాల్‌లో కొత్తగూడెం ఫిలిం ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి సూపర్ డాన్స్ సీజన్–10 పోటీలకు ముఖ్య అతిథిగా ఆయన హాజరై డాన్స్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందించారు. తల్లిదండ్రులు వారి పిల్లలను ఉదయం నుంచి రాత్రి వరకు కేవలం పుస్తకాలకే పరిమితం చేయకుండా.. వారిలో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలన్నారు. కొత్తగూడెం కళాకారులు జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పోటీలు నిర్వహించిన డాన్స్ మాస్టర్ ప్రభురాజ్‌ను అభినందించారు. కార్యక్రమంలో తెరాలా లక్ష్మి, వీరభద్రం, భవాని, ఆలీ, కమల్, కృష్ణ, యాకూబ్, వినయ్, గోవింద్, క్రాంతికుమార్, శ్రీను, పూల రవీందర్, శ్యామ్, ప్రవీణ్, పద్మప్రియ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఇల్లెందురూరల్: మండలంలోని మాణిక్యారం గ్రామ పంచాయతీ ఎల్లాపురం గ్రామంలో ఇటీవల మృతి చెందిన పడిగ సూరయ్య కుటుంబానికి ఏఎంసీ చైర్మన్ బానోత్ రాంబాబు, కాంగ్రెస్ నేతలు మంగళవారం ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పడిగ సంతోష్, పూనెం సురేష్, జోగా ప్రభాకర్, కుంజా వెంకటేశ్వర్లు, రామటెంకి నిరీక్షిత్, రాంబాబు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న రాంబాబు తదితరులు